# బ్రాహ్మణజన్మ - అమూల్యజన్మ......18-2-84

తన సాంగత్యమనే రంగుతో రంగరింపచేసే సర్వశ్రేష్ఠ బాప్‌దాదా తన యొక్క ప్రియమైన పిల్లలతో మాట్లాడుతున్నారు –

ఈరోజు సదా స్నేహంలో లీనమై ఉండే స్నేహి పిల్లలతో స్నేహసాగరుడు కలుసుకునేటందుకు వచ్చారు. ఎలా అయితే పిల్లలు స్నేహంతో బాబాని స్మృతి చేస్తున్నారో అదేవిధంగా బాబా కూడా స్నేహి పిల్లలకు కోటానుకోట్ల బదులు ఇచ్చేటందుకు సాకారసృష్టిలోకి కలుసుకునేటందుకు వస్తున్నారు. బాబా పిల్లలను తన సమానంగా అశరీరీగా, నిరాకారిగా చేస్తున్నారు మరియు పిల్లలు స్నేహంతో నిరాకారి మరియు ఆకారి బాబాని తమ సమానంగా సాకారిగా చేస్తున్నారు. ఇదే పిల్లల స్నేహం యొక్క అద్భుతం. ఇటువంటి స్నేహి పిల్లల అద్భుతం చూసి బాప్‌దాదా సంతోషిస్తున్నారు. పిల్లల గుణాల యొక్క పాట పాడుతున్నారు, సదా బాబా సాంగత్యమనే రంగుతో బాబా సమానంగా అవుతున్నారు అని. ఇలా తండ్రిని అనుసరించే పిల్లలను బాప్‌దాదా ఆజ్ఞాకారి, నమ్మకదారి, సత్యమైన అమూల్యరత్నాలు అని అంటారు. పిల్లలైన మీ ముందు ఈ స్థూలమైన వజ్రాల యొక్క నగలు కూడా మట్టితో సమానం. ఇంత అమూల్యమైనవారు. నేను బాప్‌దాదా యొక్క కంఠహారంలో విజయీమాల యొక్క అమూల్యరత్నాన్ని అని మిమ్మల్ని మీరు అనుభవం చేసుకుంటున్నారా! ఈవిధమైన స్వమానం ఉంటుందా?

డబల్‌విదేశీ పిల్లలకైతే ఈ నషా మరియు సంతోషం ఉంటుంది – మమ్మల్ని బాప్‌దాదా ఇంత దూరంగా ఉన్నప్పటికీ కూడా దూరదేశం నుండి ఎన్నుకుని తనవారిగా చేసుకున్నారు అని. ప్రపంచం బాబా కోసం వెతుకుతుంది మరియు బాబా మమ్మల్ని వెతికారు అని. ఇలా మిమ్మల్ని మీరు భావిస్తున్నారా! ప్రపంచం రా అని బాబా కోసం పిలుస్తుంది మరియు మీరందరు నెంబర్‌వారీగా ఏ పాట పాడుతున్నారు? నీతోనే కూర్చుంటాను, నీతోనే తింటాను, సదా నీ వెంటే ఉంటాను అని. పిలవటం ఎక్కడ మరియు సదా వెంట ఉండటం ఎక్కడ! రాత్రికి, పగలుకి ఉన్న తేడా ఉంది కదా! ఒక సెకను సత్యమైన అవినాశి ప్రాప్తి యొక్క దాహంతో ఉన్న ఆత్మలు ఎక్కడ మరియు ప్రాప్తిస్వరూప ఆత్మలైన మీరెక్కడ! వారు మహిమ చేసేవారు మరియు మీరందరు బాబా ఒడిలో కూర్చునేవారు. వారు అరిచేవారు మరియు మీరు ప్రతి అడుగు ఆయన మతంపై నడిచేవారు. వారు దర్శనం కొరకు దాహంతో ఉన్నారు మరియు మీరు బాబా ద్వారా స్వయం దర్శనీయమూర్తిగా అయ్యారు. ఇప్పుడిక కొద్దిగా దు:ఖం, బాధ యొక్క అనుభవం ఇంకా పెరగనివ్వండి అప్పుడు చూడండి, మీ సెకను దర్శనం కొరకు, దృష్టి కొరకు ఎంతగా దాహంతో మీ ఎదురుగా వస్తారో!

ఇప్పుడు మీరు ఆహ్వానిస్తున్నారు, పిలుస్తున్నారు. మరలా మిమ్మల్ని ఒక సెకను కలుసుకోవడానికి మమ్మల్ని కలుసుకోనివ్వండి అని చాలా శ్రమ చేస్తారు. అటువంటి సాక్షాత్ సాక్షాత్కార స్వరూపం మీ అందరికీ ఉంటుంది. అటువంటి సమయంలో మీ శ్రేష్ఠజీవితం మరియు శ్రేష్ఠప్రాప్తి యొక్క గొప్పతనం పిల్లలైన మీ కంటే ఎక్కువగా ఆ సమయంలో వారు గ్రహిస్తారు. ఇప్పుడు నిర్లక్ష్యం మరియు సాధారణత కారణంగా మీ యొక్క శ్రేష్ఠత మరియు విశేషతను మర్చిపోతున్నారు. కానీ ఎప్పుడైతే అప్రాప్తి ఆత్మలు మీ ఎదురుగా వస్తారో అప్పుడు ఎక్కువగా మనం ఎవరు, వీరు ఎవరు అనేది అనుభవం చేసుకుంటారు. ఇప్పుడు బాప్‌దాదా ద్వారా సహజంగా


Created by Universal Document Converter

మరియు చాలా ఖజానాలు లభిస్తున్న కారణంగా అప్పుడప్పుడు స్వయం యొక్క మరియు ఖజానాల యొక్క విలువను సాధారణంగా భావిస్తున్నారు కానీ ఒక్కొక్క మహావాక్యం, ఒక్కొక్క సెకను, ఒక్కొక్క బ్రాహ్మణజీవితం యొక్క శ్వాస ఎంత శ్రేష్ఠమైనది అనేది ఇక ముందు చాలా అనుభవం చేసుకుంటారు. బ్రాహ్మణజీవితం యొక్క ఒక సెకను ఒక జన్మకు కాదు కానీ జన్మజన్మల ప్రాలబ్ధాన్ని తయారుచేసేది. సెకను వెళ్ళిపోయింది అంటే అనేక జన్మల ప్రాలబ్ధం పోయినట్లే. ఇటువంటి అమూల్యజీవితం కలిగిన శ్రేష్ఠాత్మలు.ఇటువంటి శ్రేష్ఠఅదృష్టం కలిగిన విశేషాత్మలు. మీరెవరో అర్థమైందా? ఈవిధమైన శ్రేష్ఠమైన పిల్లలను కలుసుకునేటందుకు బాబా వచ్చారు. డబల్‌విదేశీ పిల్లలకు ఇది సదా స్మృతి ఉంటుంది కదా! లేదా అప్పుడప్పుడు మర్చిపోవటం, అప్పుడప్పుడు స్మృతి చేయటం చేస్తున్నారా? స్మృతిస్వరూపంగా అయ్యారు కదా! స్వరూపంగా అయిన దానిని ఎప్పుడు మర్చిపోరు. స్మృతి చేసేవారిగా కాదు కానీ స్మృతిస్వరూపంగా అవ్వాలి.

ఇలా సదా కలయిక జరుపుకునేవారికి, సదా బాబా సాంగత్యమనే రంగులో ఉండేవారికి, సదా స్వయం యొక్క, సమయం యొక్క , సర్వప్రాప్తుల యొక్క గొప్పతనాన్ని తెలుసుకునేవారికి, సదా ప్రతి అడుగులో తండ్రిని అనుసరించేవారికి, ఇలా ప్రియమైన, సుపుత్రులకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

## ఒక సర్వశ్రేష్ఠ, మహాన్ మరియు స్వర్ణిమ ఘడియ.......20-2-84

విశ్వపరివర్తనకు నిమిత్తంగా తయారుచేసే బాప్‌దాదా తన యొక్క దేశ,విదేశీ పిల్లలతో మాట్లాడుతున్నారు -

ఈరోజు భాగ్యం తయారుచేసే బాబా శ్రేష్ఠభాగ్యవాన్ పిల్లలందరినీ చూసి సంతోషిస్తున్నారు. ప్రతి ఒక బిడ్డ కల్పపూర్వం వలె అదృష్టాన్ని ఏవిధంగా మేల్కొల్పుకుని వచ్చారు అని. అదృష్టాన్ని మేల్కొల్పుకుని వచ్చారు. గ్రహించడం అంటే అదృష్టాన్ని మేల్కొల్పుకోవటం. విశేషంగా వరదాన భూమిలో డబల్‌విదేశీ పిల్లల సంఘటన జరుగుతుంది. ఈ సంఘటన అదృష్టవంతమైన పిల్లల యొక్క సంఘటన. అన్నింటికంటే మొదటి అదృష్టం తెరుచుకునే శ్రేష్ఠసమయం లేదా శ్రేష్ఠఘడియ ఇదే, ఎప్పుడైతే పిల్లలు బాబాని తెలుసుకున్నారో అంటే నా బాబా అని అంగీకరించారో అదే శ్రేష్ఠఘడియ. ఆ ఘడియయే మొత్తం కల్పంలో శ్రేష్ఠమైన మరియు స్వర్ణిమఘడియ. అందరికీ ఆ ఘడియ యొక్క స్మృతి ఇప్పుడు కూడా వస్తుంది కదా! తయార్వటం, కలుసుకోవటం, అధికారం పొందటం ఇదైతే మొత్తం సంగమయుగం అంతా అనుభవం చేసుకుంటూ ఉంటారు కానీ ఏ ఘడియలో అయితే అనాధలుగా నుండి సనాధులుగా అయ్యారో, ఎలా ఉన్నవారు ఎలా తయారయ్యారు, విడిపోయినవారు మరలా కలుసుకున్నారో, అప్రాప్తి ఆత్మ ప్రాప్తినిచ్చే దాత వారిగా అయ్యిందో ఆ అదృష్టం యొక్క ఘడియ ఎంత శ్రేష్ఠమైనది! ఎప్పుడైతే బాబా వారిగా అయ్యారో ఆ మొదటి ఘడియ స్వర్గజీవితం కంటే గొప్పది. నాది అనే దాని నుండి నీది అనేవారిగా అయ్యారు. నీది అంటే డబల్‌లైట్‌గా అయ్యారు. నాది అనే బరువు నుండి తేలికగా అయిపోయారు. సంతోషం యొక్క రెక్కలు వచ్చాయి. రాయి నుండి సత్యమైన వజ్రంగా అయ్యారు. అనేక చక్రాల నుండి


Created by Universal Document Converter